# కార్పొరేట్ రంగం... సామాజిక బాధ్యత

**ఇటీవల కాలం వరకూ వ్యాపార వర్గాలు లాభాలకే ప్రాధాన్యతనిచ్చాయి.. కానీ, ధారణత(సస్టైన్‌బిలిటీ) గురించి అంతగా పట్టించుకోలేదు. ప్రస్తుత ప్రపంచీకరణ నేపథ్యంలో... బహుళజాతి సంస్థలు, స్థానిక వ్యాపార వర్గాలు గతంలో లాగా పర్యావరణ కాలుష్యం వంటి విషయాల్లో అనైతికంగా వ్యవహరించడానికి వీలుకావడం లేదు. రోజురోజుకు అప్రమత్తమవుతున్న మీడియా, స్వచ్ఛంద సేవా సంస్థల ఒత్తిడి, పౌర సమాజం క్రియాశీలత, వినియోగదారులు, ప్రభుత్వం మొదలైనవి కార్పొరేటు రంగాన్ని ధారణీయ పద్ధతులను అనుసరించేట్లు చేస్తున్నాయి. దాంతోపాటు మంచి వ్యక్తులు తమ సంస్థల్లో పనిచేసేందుకు ఆకర్షితులవ్వాలన్నా.. వినియోగ దారులు తమ సరకులను/ సేవలను వినియోగించుకోవాలన్నా... ఈ వ్యాపార సంస్థలు తమ దైనందిన కార్యకలాపాల్లో నైతిక సూత్రాలను పాటించాలి. ఇలా నైతిక సూత్రాలను పాటించడాన్ని.. సామాజిక బాధ్యతగా చెప్పవచ్చు!!**

కార్పొరేట్ రంగ సామాజిక బాధ్యతగా... ''వ్యాపార సంస్థలు నిజాయితీతో వ్యవహరిస్తూ.. తమ లక్ష్య సాధనకు కృషి చేస్తూ.. విలువలకు పట్టం కడుతూ.. భాగస్వాముల ప్రయోజనాలను పరిరక్షించాలి''. వాణిజ్యరంగం ఈ దిశగా కదులుతున్నా... కార్పొరేట్ వ్యవస్థ ఆశించిన మేర స్పందించడం లేదని, కేవలం తన స్వప్రయోజనాల పరిరక్షణకే సామాజిక బాధ్యత నినాదాన్ని వినియోగించుకుంటోందనే భావన బలంగా ఉంది. బహుళజాతి సంస్థలు... ఉత్తర అమెరికాలో పాటిస్తున్న కఠిన నిబంధనల కారణంగా నైతికంగా ఉంటున్నాయే తప్ప, ఇతర ప్రాంతాల్లో దీనికి పూర్తి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నాయనే ఆరోపణ ఉంది. తృతీయ ప్రపంచ దేశాల్లో వ్యాపారం చేసే బహుళ జాతి సంస్థలు... బాల కార్మిక వ్యవస్థను ప్రోత్సహిస్తున్నాయనే విమర్శ కూడా ఉంది. వాటాదారుల, ఉద్యోగుల ప్రయోజనాలను దృష్టి లో పెట్టుకొని వ్యవహరించే ఈ సంస్థలు.. సామాజిక బాధ్యతను అంకితభావంతో నిర్వహించడం కష్టం. మారిన ప్రస్తుత పరిస్థితుల్లో వాణిజ్య సంస్థలు.. మానవహక్కులు, వ్యాపార నైతిక నియమావళి, పర్యావరణ పరిరక్షణ, సామాజిక ప్రగతి తదితర అంశాలను నిర్లక్ష్యం చేయడం కుదరదు. చాలా వ్యాపార/పారిశ్రామిక సంస్థలు.. ఉద్యోగులకు పని నిబంధనలను మెరుగుపర్చడం, పర్యావరణాన్ని పరిరక్షించడం, సామాజిక కార్యక్రమాలు నిర్వహించడం, దానధర్మాలు చేయడం లాంటివి కొనసాగి స్తున్నాయి. కార్పొరేట్ వ్యవస్థలు ఎందుకు సామాజిక బాధ్యత కలిగి ఉండాలి? దీనికి జవాబు.. సమాజం లేనిదే ఈ సంస్థలకు మనుగడ లేదు! అవి వ్యాపారం చేసి, లాభాలు గడించాలంటే.. సమాజం అనుకూల వాతావరణాన్ని కల్పించాలి. వాటాదారుని పెట్టుబడి వృద్ధి చెందాలంటే సమాజం తోడ్పాటు ఎంతో అవసరం. వాటాదారులతో పాటు సమాజంలోని మిగతా వర్గాల ప్రయోజనాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ఖాతాదారులు, ఉద్యోగులు సంతృప్తి చెంద కుంటే.. సదరు వ్యాపార సంస్థ మనుగడే ప్రశ్నార్థకమవుతుంది.

కార్పొరేట్ సుపరిపాలన అంటే... చలికాలంలో పేదలకు దుప్పట్లు పంచడం.. వరద ముంపు

ప్రాంతాల్లో ఆహార పొట్లాలు పంపిణీ చేయడమే కాదు.. కంపెనీ తన సమయాన్ని, వనరులను సామాజిక శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని వినియోగించాలి. తమ వస్తువులు/ సేవలకు గిరాకీ ఏర్పడాలంటే.. వ్యాపార సంస్థ సామాజిక స్పృహతో వ్యవహరిస్తుందనే భావం వినియోగదారుల్లో కలగాలి. సమాజానికి సహాయం చేయడం అనేది కేవలం వాటి ధర్మం మాత్రమే కాదు, అది వాటి విధి కూడా. సామాజిక బాధ్యత వ్యాపార సంస్థలకు అంతర్గత, బహిర్గత ప్రయోజనాలను చేకూరుస్తుంది. అంతర్గతంగా.. ఉద్యోగుల్లో తాము సమాజానికి ఎంతో కొంత సేవ చేస్తున్నామనే సంతృప్తి వారిలో పని పట్ల ప్రేరణ కలిగిస్తుంది.. అది ఆ సంస్థ అధికోత్పత్తికి దోహదం చేస్తుంది. బహిర్గతంగా సంస్థ సేవా కార్యక్రమాలు సమాజంలో దానికి మంచి పేరు తెచ్చిపెడతాయి. దాంతో ఆ కంపెనీ వస్తువులు/ సేవలకు గిరాకీ పెరిగి, లాభాలకు దోహదం చేస్తుంది.

## భారతదేశంలో పరిస్థితి:

ఉదారవాదం, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణల నేపథ్యంలో... రాజ్యం క్రమేణా తన క్రియాశీల విధానానికి స్వస్తి చెప్పడం, ప్రభుత్వేతర, స్వచ్ఛంద సంస్థలు క్రియాశీలంగా వ్యవహరించడం.. మనం గత రెండు దశాబ్దాలుగా చూస్తున్నాం. ఈ మార్పు పట్ల సమాజంలోని పేద వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. సహజ, కృత్రిమ సంక్షోభాల కారణంగా ప్రజల్లో మరోవైపు అభద్రతా భావం ఏర్పడుతోంది. ఈ క్లిష్ట కాలంలో కార్పొరేట్ వ్యవస్థ తన పరిధిలో కొన్ని సామాజిక బాధ్యతలను చేపట్టడం ఎంతైనా అవసరం. భారత సమాజం వితరణకు మారుపేరు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం మన సంస్కృతి. తోటివారి పట్ల కరుణ చూపడం మన సంప్రదాయం. మోక్షసిద్ధి ఆశించిగాని, అవసరంలో ఆపన్నహస్తం అందించామనే తృప్తిగాని.. దానధర్మ కార్యకలాపాలకు పురికొల్పుతుంది. నేటి సంక్లిష్ట సమాజంలో వ్యక్తిగత వితరణ చాలదు. లాంఛనమైన వ్యవస్థీకృత వితరణ అవసరం. అది కార్పొరేట్ వ్యవస్థ నిర్వహించగలదు. వితరణ కార్యకలాపాలు నిర్వహించే కార్పొరేట్ సంస్థల్లో ''టాటా సముదాయం'' ప్రధానమైంది. ఈ సముదాయంలో 66 శాతం పెట్టుబడి ట్రస్టుకు చెందుతుంది. వీరు దేశవ్యాప్తంగా విద్య, వైద్య రంగాల్లో సమాజానికి చేస్తున్న సేవ ఆదర్శనీయం. జంషెడ్జీ టాటా తన వారసులకు ఇచ్చిన సందేశం.. ''మీరు ఆర్జించే ప్రతి రూపాయి లాభం సమాజానికి పది రెట్లు ఉపయోగపడేలా ఉండాలి''. ఐటీసీ సంస్థ వ్యవసాయాభివృద్ధిని తన వ్యాపార వ్యూహంలో ప్రధానాంశంగా గుర్తించింది. గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు పెంచడానికి కృషి చేస్తోంది. టీసీఎస్, విప్రో వంటి సంస్థలు.. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఉపయోగపడే సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేసి, విద్యా రంగానికి సేవ చేస్తున్నాయి. వయోజన విద్యను ప్రోత్సహించడంలో ఈ సంస్థలు రూపొందించిన సాఫ్ట్‌వేర్ ఎంతగానో ఉపయోగ పడుతోంది. బ్యాంకులు, బీమా కంపెనీలు.. కూలిపని చేసుకొనేవారికి, వీధుల్లో వస్తువులు అమ్ముకునే విక్రయదారులకు సూక్ష్మ పరపతి విధానాల (మైక్రో క్రెడిట్ స్కీమ్స్) ద్వారా రుణ సదుపాయం అందిస్తున్నాయి. ఇటీవల జరిపిన సర్వే ప్రకారం.. మన దేశంలో 90 శాతం వ్యాపార సంస్థలు వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ఆసియా ఖండంలో కార్పొరేట్ వ్యవస్థల ద్వారా సంక్షేమ కార్యక్రమాలు

నిర్వహిస్తున్న మొదటి మూడు దేశాల్లో భారతదేశం ఒకటి. ప్రభుత్వరంగ సంస్థ అయిన భారత్ పెట్రోలియం.. సేవా రంగంలో మంచి పేరు సంపాదించింది. గతేడాది భారత కార్పొరేట్‌రంగం సామాజిక బాధ్యతల నిర్వహణ కోసం 6.31 బిలియన్ల డాలర్లు ఖర్చు చేసింది. భారత ప్రభుత్వరంగ సంస్థ స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా 21.05 మిలియన్ డాలర్లు సామాజిక సేవకు వినియోగించింది. టాటా స్టీల్ కంపెనీ 850 పడకల ఆసుపత్రిని జంషెడ్‌పూర్‌లో నిర్వహించడంతో పాటు, గత సంవత్సరం 31.58 మిలియన్ల డాలర్లు గ్రామీణ పథకాలకు ఖర్చుచేసింది.

పలు పెద్ద వ్యాపార సంస్థలు కాలుష్య నివారణ ద్వారా ధారణీయ ప్రగతి (sustainable development) సాధించడానికి కృషి చేస్తున్నాయి. 2008లో కోకాకోలా కంపెనీ 25–30 మిలియన్ డాలర్ల ఖర్చుతో 30,000 మంది విద్యార్థులకు రక్షిత మంచినీరు, నీటి సంరక్షణ కార్యక్రమాలు ప్రారంభించింది. మిట్టల్ కంపెనీ జార్ఖండ్, ఒరిస్సాల్లో 500 మిలియన్ల డాలర్లు పర్యావరణ పరిరక్షణకు ఖర్చు పెట్టింది. ఇస్రో సంస్థ సౌజన్యంతో టాటా మోటార్స్, హైడ్రోజన్‌తో నడిచే కారును ఉత్పత్తి చేయడానికి నడుం కట్టింది. పెరుగుతున్న ఇంధన కాలుష్యాన్ని తగ్గించడానికి బజాజ్ ఆటో, అశోక్ లేల్యాండ్, టాటా మోటార్స్, మహేంద్ర అండ్ మహేంద్ర కంపెనీలు సంయుక్తంగా పరిశోధనలు చేస్తున్నాయి. పెప్సికో కంపెనీ నీటి పరిరక్షణకు ఉదారంగా వ్యయం చేస్తోంది. కర్మాగారాల నుంచి వెలువడే వ్యర్థపదార్థాలను శుద్ధి చేయడానికి కృషి చేస్తోంది. రిలయన్స్ పవర్ కంపెనీ 12.63 బిలియన్ డాలర్ల పెట్టుబడితో ప్రత్యామ్నాయ ఇంధనాల ఉత్పత్తికి పూనుకుంది. ఈశాన్య సరిహద్దు రాష్ట్రాల్లో పుష్కలంగా లభించే జల వనరుల ద్వారా 5,000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి కంకణం కట్టుకుంది. సామాజిక బాధ్యతలో భాగంగా పలు కార్పొరేట్ కంపెనీలు గ్రామీణాభివృద్ధి కోసం పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. ఎయిర్‌టెల్ సంస్థ, భారత వ్యవసాయదారుల ఎరువుల సహకార సమాఖ్యతో కలిసి.. రైతులకు సాగు, వాతావరణం, ధరలు తదితర అంశాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రతి రోజు ఉచితంగా అందిస్తోంది. ఐటీసీ–ఇ చౌపల్ ద్వారా వ్యవసాయదారులకు, గ్రామీణ ప్రజలకు తాము ఉత్పత్తి చేసిన వస్తువులు/ధాన్యం/కూరగాయలకు గిట్టుబాటు ధరలు లభించేలా చేస్తోంది. హెచ్‌డీఎఫ్‌సీ కొన్ని గ్రామాలను దత్తత తీసుకొంది. డీసీఎం శ్రీరామ్ తన ''కృషి, వికాస్ కేంద్రాల ద్వారా'' రైతులకు అవసరమైన సమాచారాన్ని అందిస్తోంది. బైర్రాజు ఫౌండేషన్ గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. ఇన్ఫోసిస్, సత్యం ఫౌండేషన్ లాంటి దిగ్గజాలు.. విద్య, వైద్య రంగాల్లో సేవలందిస్తున్నాయి. మైక్రోసాఫ్ట్ కంపెనీ గ్రామీణ పాఠశాలలకు ఉచితంగా కంప్యూటర్లు అందిస్తోంది. మెలిండా బిల్ గేట్స్ ఫౌండేషన్‌ద్వారా హెచ్‌ఐవీ బాధితులకు ఉచితంగా మందులు అందిస్తోంది. గతంలో భారత్‌ను అధిక జనాభాతో కూడిన విఫల రాజ్యం (ఫెయిలింగ్ స్టేట్)గా పేర్కొనేవారు. అయితే మారిన నేటి పరిస్థితుల్లో.. అధిక జనాభాను మానవవనరులుగా మార్చి.. ప్రపంచంలోనే శక్తిమంతమైన దేశంగా అవతరించడానికి భారత్ ప్రయత్నిస్తోంది. ఈ ప్రయత్నం విజయవంతం కావాలంటే... కార్పొరేట్ సంస్థలు నడుంకట్టి ముందుకు రావాలి. భారత ప్రగతి, ప్రపంచ ప్రగతికి సోపానం!!.